క్లుప్తంగా

గ్రామ కార్యదర్శి దూషించారని ఫిర్యాదు



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సందీప్

మిర్యాలగూడ టౌన్ : ప్రజా సమస్యలపై వేములపల్లి గ్రామ కార్యదర్శి జి.శ్రవణ్‌కు ఫోన్ చేసి మాట్లాడినందుకు తన పట్ల అసభ్యకరంగా మాట్లాడారంటూ అతడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వేములపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యులు పుట్టల సందీప్ ఫిర్యాదు చేశారు. ఊరిలో బోనాల పండుగకు దాతలు ఇచ్చిన చందాల వివరాలు తనకు పర్సనల్ వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాలని ఈనెల 9న వేములపల్లి గ్రామ కార్యదర్శి శ్రవణ్‌ను కోరితే తనపట్ల ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బంది జాగ్రత్తలు వహించాలి

మిర్యాలగూడ అర్బన్ : విద్యుత్ సిబ్బంది జాగ్రత్తలు వహించాలి టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ వి.శివాజీ అన్నారు. బుధవారం మిర్యాలగూడ ట్రాన్స్‌కో కార్యాలయానికి వచ్చిన ఆయన తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరా, నిర్దేశిత చర్యలపై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయనకు ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస చారి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారావుతోపాటు ఏడీలు, ఏఈలు పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అభిమానం చాటుకున్న రైతు



కేసీఆర్ పేరుతో వరినారు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం గణేష్‌పహాడ్ గ్రామానికి చెందిన యువ రైతు రాత్ల రమేష్‌నాయక్ తన పొలంలో వరినారుతో కేసీఆర్ పేరు రాసి అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు సకాలంలో ప్రభుత్వ పథకాలు అందేవని, 24గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అందాయని, యూరియా కొరత లేకుండా చూసేవారని రమేష్‌నాయక్ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

డిండి: నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ.బాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం డిండి మండల కేంద్రంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా వద్ద పోలీసులు ద్విచక్రవాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేటు లేకుండా నడుపుతున్న 12 బైక్‌లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి వాహనదారులకు ఎస్‌ఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం బైక్‌లకు చలాన్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నాగరాజు, డేవిడ్, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం



మొక్క నాటుతున్న సుభానొద్దీన్

డిండి: డిండి మండల పరిధిలోని ఎర్రారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవంలో భాగంగా బుధవారం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా దేవరకొండ ఇన్‌చార్జ్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.డి.సుభానొద్దీన్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏటా నిర్వహిస్తున్న వన మహోత్సవంలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు. ఆయన వెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వెంకటేష్, నవీన్‌కుమార్, హెచ్‌ఎం.పూర్యానాయక్, గ్రామస్తులు షకీల్‌బాబా, రషీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు

పెద్దవూర : మండల కేంద్రంలోని శ్రీసాయి మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్, ఏ1 దయాగ్న స్టిక్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్స్ వైద్యులచే బుధవారం మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గైనిక్, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వాహకుడు కర్నాటి అంజిరెడ్డి, పాకాల హరి, వైద్యులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం.. అవస్థల్లో జనం

- మొసంగి స్టేజీ నుంచి తెరాటిగూడెం వెళ్లే మార్గంలో పదిహేనేళ్లుగా నిర్మాణానికి నోచుకోని బ్రిడ్జి
- వర్షాకాలంలో మోకాళ్లలోతు నీళ్లు నిలుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఊరికి వెళ్లాలంటే ఈ వరదను దాటాల్సిందే

గుర్రంపోడు : తెరాటిగూడెం, మొసంగి స్టేజీ గ్రామాలను కలిపే మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయినప్పటికీ, మధ్యలో బ్రిడ్జి నిర్మాణం మాత్రం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతోంది. లోతుగా నిలిచిన నీటిలో గ్రామస్తులు ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డు సరిగా లేకపోవడం వల్ల తెరాటిగూడెం గ్రామ ప్రజలు తమ వ్యవసాయ పొలాల వద్దకు, మొసంగి స్టేజీ వద్దకు వెళ్లడానికి ఆరు కిలోమీటర్ల అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తుంది. అంతేకాకుండా, హాలియాకు వెళ్లాలంటే ఇదే మార్గాన్ని ఉపయోగించాల్సి ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి సుమారు 15 సంవత్సరాలు గడుస్తున్నా, బ్రిడ్జి నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. ప్రతి ఎన్నికల సమయంలోనూ నాయకులు బ్రిడ్జి నిర్మాణంపై హామీలు ఇస్తున్నారు, కానీ ఆ తర్వాత ఆ విషయాన్ని విస్మరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో, మళ్లీ ఈ బ్రిడ్జి నిర్మాణం ఎన్నికల నినాదంగా మారే అవకాశం ఉంది.

అసంపూర్తిగా మిగిలిన 500 మీటర్ల రోడ్డు..

మొసంగి స్టేజీ–తెరాటిగూడెం మధ్య బ్రిడ్జి, దాని ఇరువైపులా కలిపి సుమారు 500 మీటర్ల వరకు రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. ఐతే గతంలో తారు రోడ్డు నిర్మించిన సమయంలో, ఈ మధ్య ప్రాంతంలో చౌడు నేల, వంపు ఉండటం వల్ల సిమెంట్ రోడ్డు (సీసీ రోడ్డు) నిర్మిస్తామని చెప్పి ఆ పనిని వదిలేశారు. బ్రిడ్జి నిర్మాణానికి పునాదులు తవ్విన కాంట్రాక్టర్, నిధులు సరిపోవడం లేదని చెప్పి పనిని నిలిపివేశాడు. అంతేకాకుండా నిర్మాణానికి తెచ్చిన పైపులను కూడా వెనక్కి తీసుకువెళ్లాడు. ఈ అసంపూర్తి నిర్మాణం జరగడం వల్ల రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



గ్రామం నుంచి నిత్యం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే వారు మోకాలి లోతు నీటితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాకాలంలో వరద నీటి ప్రవాహం వల్ల రాకపోకలు నిలిచిపోతున్నాయి. మేము పండించిన పంట దిగుబడులను ఇంటికి తెచ్చుకోవడానికి ఆరు కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి ప్రయాణించాల్సి వస్తుంది. మొసంగి స్టేజీ నుంచి తెరాటిగూడెం మార్గంలో తక్షణమే బ్రిడ్జి నిర్మించాలి.

– జక్కల వినోద్‌కుమార్, తెరాటిగూడెం

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లు



స్వర్ణముఖి కాలువ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్లని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండ మున్సిపాలిటీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో ఎక్కడా పారిశుద్ధ్య సమస్య తలెత్తకూడదని అధికారులకు సూచించారు. ఆయా వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పనులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం 10 ,3వ వార్డుల్లో రూ.1.81 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, కమిషనర్ సుదర్శన్, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ,, నాయిని మాధవరెడ్డి, సిరాజ్‌ఖాన్, వేణుధర్‌రెడ్డి, దేవేందర్, హన్మంతు వెంకటేష్‌గౌడ్, ఎండీ యూనూస్, పున్న వెంక టేష్, తౌఫిక్, సైదులు, రాంసింగ్, ప్రదీప్, రయిస్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కోరారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని మార్కెట్‌యార్డులో నియోజకవర్గ పరిధిలోని మండలాలకు చెందిన 166 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.57.46లక్షలు విలువ గల చెక్కులతో పాటు పలువురికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, రుక్మారెడ్డి, వేణుధర్‌రెడ్డి, సిరాజ్‌ఖాన్, యూనూస్, వెంకటయ్య, సైదులు, గోవిందు, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు...అండగా ఉంటా

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారెవరూ అధైర్య పడొద్దని.. వారికి తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే బాలునాయక్ భరోసానిచ్చారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన ఓ వృద్ధురాలు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరడంతో వృద్ధురాలు ఉంటున్న ఇంటిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

గౌరికుంటతండా సందర్శన

కొండమల్లేపల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు కొండమల్లేపల్లి మండల పరిధిలోని గౌరికుంటతండాలో సుమారు 15 ఇళ్లు నీట మునగడంతో బుధవారం దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ పరిశీలించారు. ఇక ముందు వరద నీరు తండాలోకి రాకుండా చర్యలుతీసుకోవాలని అధికారులకు సూచించారు. అందుకు అవసరమైన నిధులు వెంటనే చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీఓవో బాలరాజురెడ్డి, తహసీల్దార్ నరేందర్, ఆర్‌ఐ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, ఉట్కూరి వేమన్‌రెడ్డి, కుంభం శ్రీనివాస్‌గౌడ్, రమావత్ భాస్కర్, నాయకులు తదితరులున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న కల్లెపల్లి రైతులు

మిర్యాలగూడ : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ అన్నారు. బుధవారం మిర్యాలగూడలోని తన కార్యాలయంలో ఎంపీడీఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కృష్ణా, మూసీ నదులు, తుంగపాడు బంధం వెంట ఉన్న గ్రామ ప్రజలు నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా చూడాలన్నారు. నదులు, వాగులకు వెళ్లే దారుల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూం 08689295001 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ పరిపాలన అధికారి శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్ సురేష్‌కుమార్, డీఎల్‌పీఓ రాఘవరావు, ఎంపీడీఓ ఎం.శేషగిరిశర్మ, ఎం.రమేష్ పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్‌కు సన్మానం

దామరచర్ల మండలం కల్లెపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 148లో గల ప్రభుత్వ భూమిని ఇరవై ఏళ్లు సాగు చేసుకుంటున్న రైతులకు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ పట్టాలు అందించారు. దీంతో బుధవారం ఆయనను పలువురు రైతులు కలిసి శాలువా కప్పి సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ చొరవతో తమ భూ పట్టాల సమస్య పరిష్కారమైందని ఆనందం వ్యక్తం చేశారు.

మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుర్రంపోడు : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో మిగిలి ఉన్న ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.రాగిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వ తేదీలోగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అడ్మిషన్ కావాల్సిన వారు నేరుగా పాఠశాలకు వచ్చిగాని, 9397320844 ఫోన్ నంబర్‌లోగానీ సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నిర్మించుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైతన్య కుమార్ చౌహాన్

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇళ్లను నిర్మించుకోవాలని తెలంగాణ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ చైతన్య కుమార్ చౌహాన్ అన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని నాయకునితండాలో నిర్మిస్తున్న 45 ఇందిరమ్మ ఇళ్లను హౌజింగ్ పీడీ రాజ్‌కుమార్‌తో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నాలుగు వందల నుంచి ఆరు వందల స్క్వేయర్ ఫీట్ల పరిధిలోనే ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు. అలా కాకుండా ఎక్కువ పరిధిలో నిర్మించుకున్నట్లయితే ఇంటి నిర్మాణానికి అదనపు ఖర్చు అవ్వడంతోపాటు, ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులు సైతం రావని తెలిపారు. నెల రోజుల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినట్లయితే గృహప్రవేశాలకు సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకొనే ప్రతి లబ్ధిదారుడు మరుడుదొడ్డిని సైతం నిర్మించుకోవాలని, అలా నిర్మించుకుంటేనే బిల్లులు వస్తాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. ఆయన వెంట డీఈ నాగేందర్, ఏఈ గోపి, గ్రామస్తులు మేరావత్ ముని నాయక్, భిక్షాలు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

పశువుల సంరక్షణలో జాగ్రత్తలు తీసుకోవాలి



పశువులను పరీక్షిస్తున్న పశు వైద్యులు

మిర్యాలగూడ టౌన్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పశువుల సంరక్షణలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని మిర్యాలగూడ పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శంకర్‌రావు అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం ఆలగడపలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పశు వైద్య శిబిరంలో 53 గేదెలను పరీక్షించి వైద్యం అందించినట్లు తెలిపారు. అదే విధంగా 26 దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు పేర్కొన్నారు. రానున్న మూడురోజుల పాటు వర్ష సూచన ఉన్న నేపథ్యంలో రైతులు తమ పశువులను ఎత్తైన ప్రదేశాల్లో ఉంచి, శుభ్రమైన మేత, నీటిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ముందు జాగ్రత్తగా సమీపంలోని పశు వైద్యుల నంబర్లను తీసుకోవాలన్నారు. మేత కోసం గొర్రెలు, మేకలను వాగులు, నది తీర ప్రాంతాలకు తీసుకెళ్లొద్దని సూచించారు. ఉరుములు, మెరుపులు వచ్చినప్పుడు పశువులను చెట్ల కింద కాకుండా సురక్షితమైన షెడ్లలో ఉంచాలన్నారు. పశువులను గుంపులుగా కాకుండా విడివిడిగా ఉంచడం మేలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీపీ ఈఓ డాక్టర్ రాజశేఖర్, మండల వైద్యాధికారి ఎస్. దుర్గా రమాదేవి, జేవీఓ జానీపాష, ఎల్‌ఎస్‌ఏ రమ్య, నాగరాజు, గోపాలమిత్ర సూపర్‌వైజర్ శివారెడ్డి, గోపాలమిత్రలు ప్రభాకర్, సందీప్, నాగరాజు, హరికృష్ణ, శ్రీను, వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

- మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట: దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో అంకాలమ్మ జాతరలో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంకాలమ్మ తల్లి అనుగ్రహం ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, రాములుగౌడ్, పాలగోని సత్యనారాయణగౌడ్, మోహన్‌కృష్ణ, వడ్త్య బాలు, గుండెబోయిన పవన్, వెంకటయ్య, లింగం , ప్రశాంత్, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులు ప్రకటించాలి

మిర్యాలగూడ టౌన్ : భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలతోపాటు ప్రభుత్వ కార్యాలయాలకు రెండు రోజుల పాటు సెలవులు ప్రకటించాలని బంజార ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ నాయక్ కోరారు. బుధవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. అనుకోని సంఘటనలు విద్యార్థులు ప్రాణాలు కోల్పోతే తల్లిదండ్రుల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు.

డిండికి కొనసాగుతున్న వరద

డిండి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు ద్వారా డిండి ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. బుధవారం డిండి ప్రాజెక్టులోకి 3055 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా బుధవారం సాయంత్రం వరకు 31 అడుగులకు చేరిందని ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



కేంద్రప్రభుత్వం, ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

దేవరకొండ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.డి. మైనొద్దీన్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారిపై రైతు సంఘం, ఏఐటీయూసీ, సీపీఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం,అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద అడుగులకు మడుగులొత్తుతూ దేశ సార్వభౌ మత్వాన్ని ట్రంప్‌కు తాకట్టు పెట్టే విధంగా ప్రధాని విధానాలు ఉన్నాయని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, సుదర్శన్ రెడ్డి, పల్లా రంగారెడ్డి, వలమల్ల ఆంజనేయులు, అంజల్‌రావు, వెంకటేశ్వర్లు, ఉస్సేన్, మాధ వరెడ్డి, పుల్లయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

మిర్యాలగూడ అర్బన్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్ జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా నిర్వహించి ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆలిండియా కిసాన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య, నాయకులు రవినాయక్, గోవిందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, సైదులు, ఊర్మిల, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సైదమ్మ, భిక్షం, వాడపల్లి రమేష్, మాధవరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



అవంతీపురం గురుకులంలో మాట్లాడుతున్న డాక్టర్ మువ్వ రామారావు



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై రమేష్

మిర్యాలగూడ టౌన్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని జన విజ్ఞాన వేదిక జాతీయ సలహాదారుడు, డాక్టర్ మువ్వ రామారావు, సమూహ రైటర్స్‌ఫోరం నేత కస్తూరి ప్రభాకర్, భారత్ బచావో జిల్లా అధ్యక్షురాలు ఉదయ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలం అవంతీపురం గిరిజన గురుకుల పాఠశాలలో ×విద్యా–శాస్త్రీయ దృక్పథం¤ అనే అంశంపై జేవీవీ, సమూహ రైటర్స్‌ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ప్రిన్సిపాల్ జానునాయక్, వైస్ ప్రిన్సిపాల్ రాజరత్నం, అధ్యాపకులు అజయ్‌కుమార్, సత్రు, మంగ్యానాయక్, యాదయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

కొండమల్లేపల్లి : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా బుధవారం కొండమల్లేపల్లిలోని శ్రీ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థుల చేత ఎస్సై అజ్మీర రమేష్ మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి, హుక్కా, కొకైన్, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ల ఆంజనేయులు, డి.అశోక్, కానిస్టేబుళ్లు తిరుపతి పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

త్రిపురారం : వర్షాలు కురుస్తున్నందున అధికారుల ప్రజలకు అందుబాటులో ఉండాలని త్రిపురారం మండల ప్రత్యేక అధికారి వి.లీలా ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వాగులు, చెరువులు తెగే పరిస్థితులు తలెత్తితే తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమారి, మండల వైద్యాధికారి మాళోతు సంజయ్, పుట్ట గోపాల్‌రెడ్డి, జాఫర్, కోడిరెక్క రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు ఆకట్టుకున్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉట్లు కొట్టారు. అనంతరం కోలాటాలు ఆడుతూ.. నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం , ఎంఈఓ తరి రాములు, ఉపాధ్యాయులు రమాదేవి, కృష్ణయ్య, చంద్రమణి, చంద్రకళ, మేరమ్మ, లలిత, అనిల్, వాల్య, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



పెద్దవూర జెడ్పీహెచ్‌ఎస్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

వర్షాలకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



తడకమళ్ల సమీపంలో గల పిల్లవాగును పరిశీలిస్తున్న ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య

మిర్యాలగూడ టౌన్ : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య కోరారు. బుధవారం మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామ శివారులో ఉధృతం ప్రవహిస్తున్న పిల్లవాగును పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు అత్యవసరం అయితే వెంటనే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఉధృతంగా పారుతున్న వరదల్లోకి ప్రజలు ఎవరూ వెళ్లవద్దని సూచించారు.

వర్షానికి కూలిన గోడ

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి బంగారుకుంట తండా పరిధిలోని చింతచెట్టు తండాలో రమావత్ లాలుకు చెందిన పూరి గుడిసె గోడ కూలిపోయింది. ఎలాంటి ప్రాణహాని జరగలేదు.

వేములపల్లి : మండల పరిధిలో మూసీ వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ డి.వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

కొత్త సంఘాలు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న ఏపీఎం మధుసూదన్

మాడుగులపల్లి: అన్ని వయస్సుల వారికి కొత్తగా స్వయం సహాయక సంఘాల ఏర్పాటు చేస్తామని సెర్ప్ సంస్థ ఏపీఎం మధుసూదన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వీఓఏలు, సంఘబంధాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాలు దాటిన మహిళలకు వృద్ధాప్య సంఘాలు, 16–18 సంవత్సరాలలోపు గల బాలికలకు కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న జెడ్పీ సీఈవో

వేములపల్లి : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జెడ్పీ సీఈఓ డి.శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. కురుస్తున్న వర్షాలకు ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆసుపత్రిలో రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, భవిత కేంద్రాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, వైద్యాధికారి సుచరిత, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ప్రిన్సిపాల్ దీనసుజాత, ఫార్మసిస్ట్ గీతావాణి, నరేష్, నరేందర్, నాగమణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

దేవరకొండ: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని దేవరకొండ ఏడీఏ, ప్రత్యేక అధికారి శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం దేవరకొండ మండల పరిధిలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. కూరగాయలు, నిత్యావసర సరుకులు నిల్వ చేసే గదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం తూర్పుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీడీఓ డానియల్, ఎంఈఓ మాతృనాయక్ ఉన్నారు.